నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
9 ఏప్రిల్ 2025
పేజీలు 8

## విద్యుత్ ఒప్పందం

విద్యుత్ వనరుల విస్తరణ, హరిత ఇంధనాల ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగంగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న కరెంట్ డిమాండ్‌ను తీర్చడానికి, పర్యావరణ పరిరక్షణకు 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం అందుబాటులోకి రానుంది. తాజా ఒప్పందం ప్రకారం హిమాచల్‌ప్రదేశ్‌లో చీనాబ్ నదిపై రూ. 6200 కోట్లతో నిర్మించే రెండు జల విద్యుత్ కేంద్రాల కోసం తెలంగాణ జెన్‌కో కొంత ప్రీమియం చెల్లించింది.

## అంతర్జాతీయం

### మయన్మార్

- మయన్మార్, థాయ్‌లాండ్‌లో మార్చి 28న భారీ భూకంపం సంభవించింది. మాండలే అనే ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో భారత్ సహాయ కార్యకలాపాలను చేపట్టింది.



### యునెస్కో

- విద్య-పోషణకు సంబంధించి యునెస్కో నివేదికను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 161 దేశాల్లో 418 మంది మిలియన్ చిన్నారులు పోషకాహార పథకాలతో లబ్ధి పొందుతున్నారని పేర్కొంది. దేశంలో పీఎం-పోషణ్ పథకం 118 మిలియన్ మంది చిన్నారులకు లబ్ధి చేకూరుస్తుందని, ప్రపంచంలో అతిపెద్ద పోషకాహార పథకాల్లో ఇది కూడా ఒకటని వెల్లడించింది.

### థాయ్‌లాండ్ పర్యటన

- భారత ప్రధాని మోదీ థాయ్‌లాండ్‌లో పర్యటించారు. ఇరు దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక స్థాయికి పెంచుకున్నాయి. అలాగే ఐటీ, ఎంఎస్ఎంఈ, సముద్ర, చేతివృత్తులు, జౌళి రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

### బహుళ దేశాల విన్యాసం



- ఐఎన్ఐవోసీహెచ్‌వోఎస్-25 పేరుతో బహుళ దేశాల వాయు విన్యాసాన్ని గ్రీస్‌లోని అండ్రావిడ వాయు కేంద్రంలో నిర్వహిస్తున్నారు. మార్చి 31న ప్రారంభమయ్యింది. ఏప్రిల్ 11 వరకు కొనసాగుతుంది.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ

- వాయు కాలుష్యం, ఆరోగ్యంపై రెండో ప్రపంచ సదస్సును మార్చి 25 నుంచి 27 వరకు కొలంబియాలోని కార్టజెన్‌లో నిర్వహించారు. 2040 నాటికి వాయు కాలుష్యాన్ని 2015 స్థాయిలో 50 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

### దిగుమతి సుంకాలు

- తమతో వాణిజ్య లావాదేవీలున్న అన్ని దేశాలపై అమెరికా సుంకాలను విధించింది. అమెరికాకు దిగుమతి అయ్యే ప్రతి వస్తువుపైనా కనిష్ఠంగా 10% నుంచి గరిష్ఠంగా 49% వరకు వీటిని విధిస్తూ అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌పై ఈ సుంకాలు 26% ఉండనున్నాయి. చైనాపై 34% సుంకాలను విధించారు. అమెరికాలో తయారీని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

### చైనా

- భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏప్రిల్ 1 నాటికి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరస్పరం సందేశాలు పంపుకొన్నారు. ఇరు దేశాలు పరస్పర వృద్ధి, స్థానికంగా శాంతి, వ్యూహాత్మక అంశాల్లో పరస్పర విశ్వాసంతో కొనసాగాలని నిర్ణయించారు.



## జాతీయం

### ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్

- ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీకి రూ. 22,919 కోట్లతో పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొసి-మెచ్చి నదుల అనుసంధాన ప్రాజెక్ట్‌కు కూడా కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

### పర్యావరణం-2025




- పర్యావరణ పరిరక్షణకు ప్రజలతో పాటు విద్యార్థులు కూడా కృషి చేయాలని పర్యావరణ సదస్సు-2025 నిర్ణయించింది. న్యూఢిల్లీలో మార్చి 29న దీన్ని నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభోపన్యాసం చేశారు.

### కాగ్-బీఐఎస్ఏజీ-ఎన్

- ఆడిటింగ్‌లో స్పేసియల్ సాంకేతికతను వినియోగించుకొనేందుకు భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్, గుజరాత్‌లోని గాంధీనగర్ కేంద్రంగా పనిచేసే భాస్కరాచార్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్-జియో ఇన్ఫర్మాటిక్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

### క్రీమీలేయర్ పరిమితి పెంపునకు వినతి

- ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న రూ. 8 లక్షల క్రీమీలేయర్ పరిధిని పెంచాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. క్రీమీలేయర్ అనే పదాన్ని మొదట సత్తనాథన్ కమిషన్ 1971లో వినియోగించింది. ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్ట్ దీన్ని ప్రస్తావించింది. రూ. 8 లక్షల వార్షిక ఆదాయం దాటిన ఓబీసీలకు రిజర్వేషన్ వర్తించదు. దీన్ని పెంచాలన్నది తాజా సూచన.

### బీజ్ సహకారి సమితి

- నాణ్యమైన విత్తనాలను భారత్ బీజ్ పేరుతో అందివ్వనున్నారు. ఇందుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ బాధ్యత తీసుకోనుంది. దీన్ని 2023లో ఏర్పాటు చేశారు. బహుళ రాష్ట్రాల సహకార సొసైటీల చట్టం ప్రకారం ఇది ఏర్పాటయ్యింది.



### వక్ఫ్ బిల్లుకు ఆమోదం

- వక్ఫ్ బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఏప్రిల్ 2న లోక్‌సభ, 3న రాజ్యసభ బిల్లును ఆమోదించాయి.

### జీన్ బ్యాంక్

- ఆహార భద్రత కోసం దేశంలో రెండో జీన్ బ్యాంక్‌ను నెలకొల్పాలని కేంద్రం నిర్ణయించింది. విత్తనాలతో పాటు మొక్కల కణజాలాలను ఇందులో భద్ర పరుస్తారు. దేశంలో తొలి జీన్ బ్యాంక్‌ను 1996లో న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచంలో రెండో అతిపెద్ద జీన్ బ్యాంక్. తొలి అతిపెద్దది నార్వేలో ఉంది.

### న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన



- న్యాయ వ్యవస్థపై విశ్వాసం, పారదర్శకతను పెంచేందుకు సుప్రీంకోర్ట్ న్యాయమూర్తులు అందరూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ఆస్తుల వివరాలను బహిరంగపరిచేందుకు అంగీకరించారు. ఏప్రిల్ 1న నిర్వహించిన పూర్తి స్థాయి న్యాయస్థాన సమావేశంలో తీర్మానం చేశారు. భవిష్యత్తులో సుప్రీంకోర్ట్ న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించేవారికి కూడా ఇది వర్తిస్తుంది.

## తెలంగాణ

### మంత్రుల కమిటీ

- కంచ గచ్చిబౌలి భూవివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ, విద్యార్థుల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీ, సివిల్ సొసైటీ గ్రూపులు సహా భాగస్వాములైన ప్రతి ఒక్కరితో చర్చిస్తుంది. కమిటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిని సభ్యులుగా నియమించారు.

### వరంగల్ మిర్చికి భౌగోళిక గుర్తింపు

- వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించింది. ఈ మిరపకాయలు లావుగా, ప్రకాశవంతమైన ఎరుపు రంగులో ఉంటాయి. కొద్దిగా టమాట ఆకారంలో ఉండే వీటిని 'టమాట మిరపకాయ' అని కూడా అంటారు. తక్కువ ఘాటుతో రుచికరంగా, శుద్ధికి, ఎగుమతికి అనువుగా ఉంటాయి. పచ్చళ్లకు చపాటా మిర్చి పొడిని అధికంగా వినియోగిస్తారు. మిఠాయిలతో పాటు ఆహార, సౌందర్య సాధనాలు, పానీయాలు, ఔషధ, వస్త్ర పరిశ్రమల్లో కూడా చపాటా మిర్చిని రంగుగా వినియోగిస్తున్నారు. స్థానిక నేలలు, వాతావరణ అనుకూలతలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ పంట ఎక్కువగా సాగవుతుంది. ఇక్కడ 20 వేల మందికి పైగా రైతులు ఏటా దాదాపు 7 వేల ఎకరాల్లో 10 వేల టన్నులకు పైగా ఉత్పత్తి చేస్తున్నారు. తమిళనాడులోని కుంభకోణం తమలపాకులు, తోవలయ్ పూల దండలకూ భౌగోళిక గుర్తింపు లభించింది.



### సెల్‌ఫోన్ల రికవరీలో రెండో స్థానం



- పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సీఐడీ పోలీసులు దేశంలో రెండో స్థానంలో నిలిచారు. కర్ణాటక అగ్రస్థానంలో ఉంది.

### సన్న బియ్యం పథకం

- పేదలకు సన్న బియ్యం ఇచ్చే పథకాన్ని మార్చి 30న ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. పేదలకు రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వనున్నారు. ప్రతి రేషన్ లబ్ధిదారులకు ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎందరు లబ్ధిదారులుంటే అంత మందికి సన్న బియ్యం ప్రయోజనం లభిస్తుంది.

### ఉపాధి వేతనం రూ. 307

- తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి హామీ రోజువారీ వేతనాన్ని రూ. 307గా నిర్ణయిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. 2025-26కు ఈ వేతనం వర్తిస్తుంది. 2024-25తో పోలిస్తే ఈ ఏడాది రూ. 7 వేతనం పెరిగింది. దేశంలో అత్యధిక రోజువారీ వేతనం హర్యానాలో ఉంది. అక్కడ రూ. 400 చెల్లిస్తున్నారు.

## ఎకానమీ

### రక్షణ రంగ ఎగుమతులు

- 2024-25లో దేశంలో రక్షణ రంగ ఎగుమతులు రూ. 23,622 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇవి 12.04% అధికం. భారత్‌లో తయారీతో పాటు ఆత్మనిర్భరత పథకంలో భాగంగా భారత్ రక్షణ రంగ వస్తువుల తయారీని ప్రోత్సహిస్తుంది.

### నీతి ఎన్‌సీఏఈఆర్

- 'నీతి ఎన్‌సీఏఈఆర్ స్టేట్స్ ఎకనామిక్ ఫోరం' అనే పోర్టల్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఏప్రిల్ 1న ప్రారంభించారు. రాష్ట్ర ఆర్థిక గణాంకాలను తెలియజేస్తుంది. నీతి ఆయోగ్, ఎన్‌సీఏఈఆర్ రెండూ కూడా మేధోమదన సంస్థలే.

### ఇనుము, ఉక్కు ఉత్పత్తులు

- ఇనుము, ఉక్కు విధానం-2025ని కేంద్రం ప్రకటించింది. ఈ రంగంలో స్వయం స్వావలంబన సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దిగుమతులు తగ్గించుకోవాలని కూడా నిర్ణయించింది. ప్రభుత్వానికి ఇనుము, ఉక్కు అవసరమైతే విధిగా దేశీయంగా ఉత్పత్తి అయిన దాన్నే సేకరించాలని కూడా ఈ విధానంలో పేర్కొన్నారు.



### తేయాకు ఎగుమతి

- 2024లో తేయాకు ఎగుమతిలో భారత్ రెండో స్థానంలో ఉంది. గతంలో ఈ స్థానంలో శ్రీలంక ఉంది. దాన్ని భారత్ అధిగమించింది. తొలిస్థానంలో చైనా నిలిచింది.

## వార్తల్లో వ్యక్తులు

### పూనం గుప్తా

- భారత రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్‌గా పూనం గుప్తా నియమితులయ్యారు.

### స్వామినాథన్ అయ్యర్

- భారత బీమా నియంత్రణ సంస్థలో పూర్తి స్థాయి సభ్యుడిగా స్వామినాథన్ అయ్యర్ నియమితులయ్యారు.

### కమలహాసన్

- ఫిక్కీ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ దక్షిణాది కమిటీ చైర్‌పర్సన్‌గా కమలహాసన్ నియమితులయ్యారు.

### దలైలామా



- టిబెట్ ఆధ్యాత్మికవేత్త దలైలామాకు గోల్డ్ మెర్క్యూరీ అవార్డ్ లభించింది. శాంతి, సుస్థిరతకు చేస్తున్న కృషికి గోల్డ్ మెర్క్యూరీ ఇంటర్నేషనల్ ఈ అవార్డ్‌ను ప్రకటించింది.

### ఎస్ రామన్

- పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌డీఆర్ఏ) చైర్‌పర్సన్‌గా ఎస్ రామన్ నియమితులయ్యారు.

### షిర్లే బొచ్‌వే

- కామన్‌వెల్త్ కూటమికి సెక్రటరీ జనరల్‌గా ఘనాకు చెందిన షిర్లే బొచ్‌వే నియమితులయ్యారు. ఈ కూటమికి నేతృత్వం వహిస్తున్న తొలి ఆఫ్రికా మహిళ ఆమె.

### మసాకీ కాశివారా



- జపాన్‌కు చెందిన గణిత శాస్త్రవేత్త మసాకీ కాశివారాకు గణితంలో నోబెల్‌గా భావించే అబెల్ ప్రైజ్ లభించింది. బీజ గణిత విశ్లేషణ, డీ-మాడ్యూల్స్ వంటి గణిత ప్రక్రియల్లో ప్రతిభ చూపినందుకు ఈ అవార్డ్ దక్కింది.

### శ్రీనివాసులు శెట్టి

- ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చల్లా శ్రీనివాసులు శెట్టి ఎన్నికయ్యారు.

### నటరాజన్ చంద్రశేఖరన్

- వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సలహా మండలికి టాటాగ్రూప్ సంస్థల చైర్మన్ చంద్రశేఖరన్ ఎన్నికయ్యారు. వ్యవస్థాపనలు, వృద్ధి అంశాలకు సంబంధించి ఆయన సలహాలు ఇవ్వనున్నారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

